క్లుప్తంగా

పిడుగురాళ్లలో వర్షం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో మంగళవారం వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా కాసింది. మధ్యాహ్నం నుంచి ఎండ తీవ్రత తగ్గి ఒక్కసారిగా వాన పడింది. సుమారు 3 గంటల నుంచి 4.30 గంటల వరకు ఏకధాటిగా వాన పడుతూనే ఉంది. ఈ వర్షం ఉపయోగకరమేనని రైతులు చెబుతున్నారు.

అన్నదానం



గురజాల : స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో పేదలకు స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్మైల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాథం మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు కటికం అంకారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దాచేపల్లి ఎంపీడీఓగా రామకృష్ణ



దాచేపల్లి : దాచేపల్లి ఎంపీడీఓగా పి.రామకృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. హైకోర్టులో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఎం.శోభారాణి రేపల్లెకి బదిలీ అయ్యారు. శోభారాణి తన బాధ్యతలను రామకృష్ణకు అప్పగించారు. ఎంపీపీ కందుల జాను, ఈవోపీఆర్డీ నాగేంద్ల రత్నం, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయం సిబ్బంది కొత్త ఎంపీడీఓతోపాటు బదిలీపై వెళ్తున్న శోభారాణిని సన్మానించారు.

మాచవరం ఎంపీడీఓగా శ్రీనివాసరావు



మాచవరం: మాచవరం ఎంపీడీఓగా పి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఉత్తర్వుల మేరకు ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా హైకోర్టులో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఎంపీడీఓగా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

మాచర్ల ఎంపీడీఓగా ఫణికుమార్ నాయక్

మాచర్ల రూరల్: మాచర్ల ఎంపీడీఓగా ఆర్ఈవీ ఫణికుమార్ నాయక్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కె.సరోజనీదేవి రెంటచింతల మండలానికి బదిలీపై వెళ్ళనున్నారు. సీనియర్ అసిస్టెంట్ గాదె శ్రీనివాసరావు రెంటచింతలకు చింతకాయల నరేష్, ఈపూరు మండలానికి, టైపిస్టు దేవళ్ళ విజయకుమార్, వెల్దుర్తికి బదిలీపై వెళ్ళనున్నారు. ఈ స్థానంలో సీనియర్ అసిస్టెంటుగా వెల్దుర్తి మండలానికి చెందిన టి.అంజిబాబు, టైపిస్టుగా లోకనాథ్, ఏఓగా జేపీవీపీ శర్మ, సీనియర్ అసిస్టెంట్‌గా కొప్పుల రవి నియమితులయ్యారు. వీరు ఈ నెలాఖరులోపు విధుల్లో చేరనున్నట్టు సమాచారం.

క్వారీ ద్వారా మంచినీటి సరఫరా

మాచర్ల: పట్టణ శివారులోని జమ్మలమడక వెళ్ళే దారిలో హైవే నిర్మాణ పనుల వల్ల మూడు రోజులపాటు నాగార్జున సాగర్ కుడికాలువ నుంచి పట్టణానికి మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా పురపాలక సంఘ క్వారీలో నిల్వ ఉంచిన నీటిని పైపులైన్ ద్వారా సరఫరా చేయనున్నట్టు వెల్లడించారు.

పౌష్టికాహారంతో బాలల ప్రగతి



నాదెండ్ల: సంపూర్ణ పౌష్టికాహారం బాలల ప్రగతికి పునాది అని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి చెప్పారు. యడ్లపాడు పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సెప్టెంబర్ 1 నుంచి ఈ నెల 30 వరకూ దేశవ్యాప్తంగా మాసోత్సవాలు జరగనున్న నేపథ్యంలో సీడీపీవో శాంతకుమారి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

ఇసుకెత్తిపోతున్న ప్రజలు

- వెంటాడుతున్న ఇసుక కొరత
- బ్లాక్‌లో అమ్మకాలు
- లారీ ఇసుక రూ.30 వేలు
- నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు
- పనుల్లేక కార్మికుల అవస్థలు



ఇసుక లేని ఖాళీ ట్రాక్టర్

మాచర్ల: ఇసుక కొరత భవన నిర్మాణ రంగాన్ని వేధిస్తోంది. ఫలితంగా ప్రజలు విసుకెత్తిపోతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. ప్రస్తుతం నియోజకవర్గంలో రవాణా చార్జీలతో కలిపి 18 టన్నుల లారీ ఇసుక ధర రూ.28 వేలకుపైగా పలుకుతోంది. గతంలో కన్నా ఇది రూ.6 వేలు ఎక్కువ. అంత ధరపెట్టి ఇసుక తీసుకుందామన్నా.. దొరకని పరిస్థితి నెలకొంది. బ్లాక్‌లో కొనాలంటే రూ.30 వేలపైనే అవుతుంది. వరదల వల్ల ఇసుక సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని చెబుతున్నారు.

భవన నిర్మాణ రంగం కుదేలు

ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ రంగం కుదేలైంది. నిర్మాణాలు నిలిచిపోయాయి. ఫలితంగా ఈ రంగంపై ఆధారపడిన తాపీపని వారు, ప్లంబర్, ఎలక్ట్రీషియన్లు పనుల్లేక సతమతమవుతున్నారు. అంతేకాకుండా కంకర, సిమెంట్, లారీ ట్రాన్స్‌పోర్టు వ్యాపారులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం తక్కువ ధరకు ఇసుక సరఫరా చేయాలని ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు కోరుతున్నారు.

నెలరోజులుగా పని లేదు



ఇసుక కొరతతో మాకు పని లేదు. భవన నిర్మాణాలు ఆగిపోవడంతో సిమెంట్ వ్యాపారాలు సాగడం లేదు. గతంలో రోజూ వెయ్యి బస్తాల సిమెంట్ లోడింగ్ చేసేవారం. ఇప్పుడు 300 బస్తాలు కూడా లోడింగ్ కావటం లేదు. పనుల్లేక భవన నిర్మాణ కార్మికులూ ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఇసుకను తక్కువ ధరకు సరఫరా చేయాలి.

అంజయ్య,
సిమెంట్ లోడింగ్ కార్మికుడు, మాచర్ల

జ్వరాల తగ్గుముఖానికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్

మాచర్ల: మాచర్ల ప్రాంతంలో జ్వరాల తగ్గుముఖానికి చర్యలు తీసుకున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.రవి తెలిపారు. మంగళవారం సాక్షి దినపత్రికలో 'ప్రజ్వరల్లే వేదన' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మాచర్లలో చికున్ గున్యా, డెంగీ కేసులు నమోదు కాలేదని, టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయని, వీటి తగ్గుదలకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. రోగులకు నిరంతరం వైద్యసేవలందిస్తున్నామని వివరించారు. వెల్దుర్తి మండలంలో జ్వరం బారిన పడిన 70ఏళ్ల వృద్ధురాలు నరసమ్మ ఆరోగ్యంగా ఉన్నారని పేర్కొన్నారు. వర్షాల వల్ల దోమలు పెరిగి జ్వరాలు పెరిగాయని, దోమల నివారణ చర్యలు చేపట్టామని వెల్లడించారు. జ్వరాల తగ్గుముఖానికి వైద్యశిబిరాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.



మండల అభివృద్ధికి కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్

మాచవరం: ప్రజాప్రతినిధుల సహకారంతో మండలానికి నిధులు సమకూర్చుకుని అభివృద్ధికి కృషి చేద్దామని ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్యం మెరుగు పరచాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చించారు. సమావేశానికి ఎంపీపీ దారం అంబులమ్మ అధ్యక్షత వహించారు. వైస్ ఎంపీపీ చల్లగుండ్ల లక్ష్మయ్య, మండల కో–ఆప్షన్ మెంబర్ మహమ్మద్ జానీ, జెడ్పీటీసీ శివయాదవ్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై దృష్టి పెట్టాలి



సమావేశంలో సమస్యలపై చర్చిస్తున్న ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, ఎంపీడీఓ మహాలక్ష్మి

రెంటచింతల: ప్రజా సమస్యలపై గ్రామ పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ సూచించారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాలలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కలిసి సమష్టిగా పనిచేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో యల్లా మహాలక్ష్మి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఇక్కడ నుంచి ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడుకు బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ మహాలక్ష్మిని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సన్మానించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రరెడ్డి, ఏపీఓ జయచంద్ర, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కవి శిఖరం జాషువా



పిడుగురాళ్ల: రచనా రంగంలో కీర్తి శిఖరం కవి చక్రవర్తి గుర్రం జాషువా అని రిటైర్డ్ జడ్జి కూచిపూడి ప్రసాదరావు చెప్పారు. జాషువా జయంత్యుత్సవాన్ని కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని లెనిన్ నగర్ కార్డ్స్ స్కూల్లో నిర్వహించారు. కార్డ్స్ సంస్థ డెప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్ అధ్యక్షత వహించారు. ప్రసాదరావు మాట్లాడుతూ జాషువా రచనలను కొనియాడారు. జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నల్గొండ జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాది కత్తి స్వర్ణలత, రాజ్‌కుమారి, సోషల్ వర్కర్ బంక విజయ్ కుమార్ జాషువా కళా సమితి అధ్యక్షులు చల్లగుండ్ల సంతోష్‌రావు, అంబేడ్కర్ సేవ సంఘం కార్యదర్శి డేగల అబ్రహం, ఎమ్మార్పీఎస్ నాయకులు ఇజ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పారిశుద్ధ్య పనులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

పిడుగురాళ్లరూరల్: గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీపీ గార్లపాటి అనసూర్య చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ కాశయ్య అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా అనసూర్య మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులు కలిసి గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. తక్షణం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతులు ఈ–పంట నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కె. ప్రవీణ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సాతులూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

అదరగొట్టిన విద్యార్థులు

- హోరాహోరీగా నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- సత్తాచాటిన క్రీడాకారులు జిల్లాస్థాయికి ఎంపిక



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు



రన్నింగ్ చేస్తున్న విద్యార్థులు

పిడుగురాళ్ల: స్కూల్ గేమ్స్‌లో విద్యార్థులు చిచ్చరపిడుగులై చెలరేగారు. ఆటల పోటీల్లో అదరగొట్టారు. పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నియోజకవర్గస్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలను నిర్వహించారు. పోటీలను పాఠశాల హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మి ప్రారంభించారు. అండర్ 14, 17 విభాగాల్లో యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సత్తాచాటారు. గెలుపొందిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ కో–ఆర్డినేటర్ నందిపాటి నర్సిరెడ్డి తెలిపారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో బుధవారం కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కో–ఆర్డినేటర్లు కె.డానియేలు, పి.వెంకట్రావు, డి.అమలా, న్యాయ నిర్ణేతలు కె.మోహన్‌కుమారి, సౌజన్య, శివరామకృష్ణ, కె.నాగభూసణం, సురేంద్ర, సీహెచ్ కిషన్‌కుమార్, ఎస్.రత్నరాజు, కె. జ్ఞానరత్నం, ఎం.రవికొండలరావు, నాగేశ్వరారవు, శిరీష, ఎస్. సుస్మిత, భబిత, విజయరాణి, సాయిబాబు, వి.రామారావు, నాగేంద్రబాబు, వై.వెంకటేష్, దుర్గ, శ్రీకాంత్, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకురాజుపల్లి శివారు భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం

పిడుగురాళ్ల: మాచవరం మండలంలోని ఆకురాజుపల్లి రెవెన్యూ గ్రామంలో రీసర్వే అయిన శివారు భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమమైంది. మంగళవారం పిడుగురాళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎల్‌పీ నంబర్లు అప్‌డేట్ అయ్యాయి. నాలుగు నెలల నుంచి ఎల్‌పీ నంబర్లు అప్‌డేట్ కాకపోవడంతో భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు సమస్య పరిష్కారమైంది.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాచర్లలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి/మాచర్ల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గుండ్లపాడు గ్రామంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో నాయకులు జవిశెట్టి తోట వీరాంజనేయులు, తోట కృష్ణమూర్తి, జవిశెట్టి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

- మాచర్ల 13, 17 వార్డుల్లో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మంజుల వెంకటేశ్వర్లు, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులతో హెచ్‌ఎం మాధవీ లత, పీడీలు

సత్తెనపల్లి: విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం జె.మాధవిలత అన్నారు. పట్టణంలోని పాఠశాల విద్యార్థినులు ఇటీవల నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచారు. నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం వారిని అభినందించారు. కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్‌లో వై.యానిశ్రీ, ఆర్.మానస, షేక్ షమీమూన్, షేక్ సమీరా, సయ్యద్ అఫ్రోజ్, వి.శ్రీలక్ష్మి, ఎస్.అమూల్య, ఎస్.అక్షయ, ఎస్.అఫ్రోజ్, అమూల్య, చైత్ర, తాహెరాబాను ఎంపికైనట్లు తెలిపారు. 100 మీటర్ల పరుగు పందెం సీనియర్ విభాగంలో జి.సాయి ప్రియాంక, జూనియర్ విభాగంలో పి.హేమలత కైవసం చేసుకున్నారని చెప్పారు. డిస్కస్ త్రోలో సీనియర్ విభాగంలో ప్రథమ స్థానం ఎం.దీపిక, సీనియర్స్ 4400 రిలేలో ప్రథమ స్థానం టి.మహాలక్ష్మి టీమ్, సీనియర్స్ 4100 రిలేలో ప్రథమ స్థానం అక్షయ టీమ్, జూనియర్స్‌లో 4100 రిలేలో ప్రథమ స్థానం పి.హేమలత టీమ్, లాంగ్ జంప్ సీనియర్స్‌లో తృతీయ స్థానం వాసవి, చెస్‌లో కె.సాయిలహరి, కె.జ్యోతి, వి.భవ్యాంజలి ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు.

రైతుల ప్రోత్సాహానికే 'పొలం పిలుస్తోంది'



ఒప్పిచర్లలో అరక తోలుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



రెంటచింతలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ బ్రహ్మారెడ్డి, రైతులు



పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

కారెంపూడి/రెంటచింతల/మాచవరం/పిడుగురాళ్ల రూరల్/దాచేపల్లి/దుర్గి: రైతులను ప్రోత్సహించేందుకే పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. కారెంపూడి మండలంలోని ఒప్పిచర్ల శివారులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా పోస్టర్ ఆవిష్కరించి కంది చేలో అరక తోలారు. రైతులు, వ్యవసాయ అధికారులతో మాట్లాడారు. అంతకుముందు కారెంపూడి జెడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో లాంఫాం శాస్త్రవేత్త ప్రవీణ్‌కుమార్, ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, హార్టీకల్చర్ ఆఫీసర్ మోహన్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏఓ యలమందారెడ్డి, ఏపీఓ కోటిరెడ్డి, పాల్గొన్నారు. పొలాల వద్ద వివిధ మందులతో కూడిన స్టాళ్లను ఏర్పాటుచేశారు. వరిలో ఆకుల కొనలు ఎర్రగా మారి ఎండిపోతున్నాయని రైతులు వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు లాంఫాం శాస్త్రవేత్త ప్రవీణ్ కుమార్, ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ యలమందారెడ్డి పొలాలను పరిశీలించారు. ఇది బ్యాక్టీరియల్ లీఫ్ బ్లైట్ అని చెప్పారు. నివారణ చర్యలు సూచించారు.

- రెంటచింతలలో ఏఓ బి.బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు ఏఓ సూచనలు, సలహాలు ఇచ్చారు. పంటల సాగుపై మెళకువలు వివరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, బొడపాటి రామకృష్ణ, మూలి రాజారెడ్డి, వీఏఏలు, వీహెచ్ఏలు రైతులు పాల్గొన్నారు.
- పిడుగురాళ్ల రూరల్ మండలం గుత్తికొండ గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ ఎన్.శ్రీనివాస్‌రెడ్డి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పంట నమోదు కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు.
- దాచేపల్లి, నడికుడిలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఏఓ డి.పాపకుమారి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు సూపర్‌వైజర్ వెంగయ్య, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.
- మాచవరం మండలం ఆకురాజుపల్లి, తురకపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏఓ కె.రామమ్మ పత్తి పంటలో గులాబీ రంగు పురుగు ఉధృతి నివారణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అన్వర్ బాషా పాల్గొన్నారు.
- దుర్గి మండలంలోనూ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. డ్రోన్, డ్రిప్ ఇరిగేషన్‌పై అవగాహన కల్పించారు. అనంతరం డ్రోన్‌ను ఆపరేట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత సాయి శంకర్, ఏడీఏ జగదీష్‌రెడ్డి, ఏఓ అమీర్‌రెడ్డి, లాంఫాం శాస్త్రవేత్త రాజేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

గేటు పడిందా.. గోవిందా





మాచర్లలో రైల్వే గేటు వల్ల పట్టణ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. గేటు పడితే ముప్పావు గంట పాటు పడిగాపులు కాయాల్సి వస్తోంది. రోజుకు ఆరు సార్లు ఇక్కడ గేటు పడుతుంది. గేటు పడిన ప్రతిసారీ 20 నిమిషాల నుంచి 45 నిమిషాల వరకు వాహనదారులు వేచి ఉండక తప్పని దుస్థితి. ఇక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఎన్నోఏళ్లుగా ప్రజలు వేడుకుంటున్నా.. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

– మాచర్ల

సామాజిక సేవాదృక్పథం అలవరుచుకోండి

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ తెలిపారు. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ, విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతాయుతంగా మెలగాలని హితవు పలికారు. ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు ఎన్ఎస్ఎస్ దోహదపడుతుందని తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అనే ఆర్యోక్తిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం కళాశాల పరిశుభ్రతలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎ.సరళాదేవి, టి.వి.శంకర రెడ్డి, రాజనాల వేణుమాధవ్, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వినుకొండలో..

వినుకొండ(నూజెండ్ల): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా వినుకొండ మండలంలోని చాట్రగడ్డపాడు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ సుందర్‌రెడ్డి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వలన నీటి కాలుష్యం, సముద్రాలకు, జంతువులకు, మానవులకు వినాశకరమైన ప్రభావాన్ని చూపుతుందని, అందువలన ప్లాస్టిక్ గ్లాసులు, పాలిథిన్ కవర్లు, స్ట్రాలు, ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ బాటిల్స్ వాడటం తగ్గించాలన్నారు. వాటికి బదులు క్లాత్ సంచులు వాడాలని తెలిపారు.

కేజీబీవీ సందర్శన

క్రోసూరు: స్థానిక కేజీబీవీ పాఠశాలను మంగళవారం జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాటి దాసు సందర్శించారు. విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు.